భార్యను పోగొట్టుకున్న అతని వింత ప్రవర్తన?

ఎన్. భవాని కథ

# కాటికాపరి

"యిదిగో బాబూ! కానివ్వు" మండుతున్న కట్టెను గిరిధర్ చేతికి అందిస్తూ అన్నాడు అతని తండ్రి. ఆలోచనల సైనికులతో పోరాడి పోరాడి అలసిపోయిన అతని మస్తిష్కం ఉలిక్కిపడి ఈ లోకంలోకి వచ్చింది.

"చితి"! హు కట్టుకున్న భార్య. అందులోనూ పాతికేళ్ళు కూడా నిండని పసితనం మూర్తీభవించిన ముగ్ధ వనజ! ఆమెకు తన చేతుల్తోనే చితి పెట్టవలసిన అభాగ్యం... ఏనాడూ... ఏనాడూ... వస్తుందని కల్లోకూడా ఊహించలేదు.

ఎంత ప్రేమగా ప్రేమించాడు తను ఆమెను! తల్లితండ్రులను సైతం ఎదిరించి ప్రేమను జయించాలనే అభిలాషతో ఎంత పట్టుదలగా పెళ్ళి చేసుకున్నాడు! "నాతిచరామి" అన్న పదంలోని అంతరార్థాన్ని ఈ ప్రపంచంలోకెల్లా అతి నిష్ఠగా పాటించిన ఘనత తనకే దక్కుతుందని ఎంత పవిత్రంగా ఆమెను ఆరాధించాడు.

కానీ... ఈరోజు... ఊహించని రీతిలో.

మొదటి ప్రసవంలోనే... "కానివ్వు బాబూ! ఆలోచిస్తూ కూర్చుంటే దానికి అంతుండదు" తండ్రి పిలుపుతో ఈ లోకంలోకి వచ్చాడు గిరిధర్.

చేతులు వణుకుతుండగా, మనసు లయ మరవగా తడబడుతున్న అడుగులతో పెను ప్రవాహంలా ముంచుకొస్తున్న దుఃఖపు కెరటాలను అతి ప్రయాసలతో ఆపేస్తూ ధారాపాతంగా కారుతున్న కన్నీటితో తడిసిపోయిన ఛాతీపై చేతిని చిక్కబట్టుకుని ముందుకు అడుగులు వేశాడు. నిప్పు పెట్టగానే



ఉవ్వెత్తున లేచిన కిరసనాయిల్‌తో తడిసిన కట్టెలమంట అతనిలోని వనజ తాలూకు అనుభూతులు కాల్చేయమని తెలిసినదేవతలందరినీ ప్రార్థించాడు.

ఎలా ఈ గాయాన్ని మాన్పుకోవడం? అంత సులభమా మనసారా ప్రేమించిన అమ్మాయితో రెండేళ్ళు చేసిన కాపురాన్ని మర్చిపోవడం? కాపురం... ఆ ఊహ రాగావే

అతని దృష్టి ఆమె మెడలో ఉన్న "మంగళసూత్రం"పై పడింది. పైనున్న కట్టెలన్నీ కాలిపోగా ఆమె శరీరం, మెడలో వున్న మంగళసూత్రం కన్పించాయి అతనికి.

"రా! బాబూ! వెళ్ళిపోదాం! చీకటైపోయింది" ఆర్ద్రంగా పిలిచాడు తండ్రి.

"నేను రాను! మీరు వెళ్ళండి!" మొండిగా సమాధానం యిచ్చాడు గిరిధర్.

"ఈ చితి ఆరేవరకు నేను యింటికి రాను. మీరు వెళ్ళిపోండి" వెక్కిళ్ళతో ఏడుస్తూ అన్నాడు.

యిక లాభం లేదని వచ్చిన పెద్దలందరూ అతనితోపాటు ఏటి ఒడ్డువ కూర్చుండిపోయారు. అతనిలో ఎక్కడలేని వైరాగ్యం... శ్మశాన వైరాగ్యం... యింతలో కాటికాపరి చేతిలో పెద్ద యినుప ఊసతో యిటుగా వస్తున్నాడు.

"ఆమె తాలూకు ఆలోచనల అంబుధిలో కొట్టుకుని కొట్టుకువి అలిసిపోయిన గిరిధర్ అతనివైపు దృష్టి సారించాడు. అతను కాలిపోయిన కట్టెలన్నిటినీ పక్కకినెట్టి చేతిలోవున్న ఇనుప ఊసతో మంగళసూత్రాన్ని బయటకు లాగుతున్నాడు.

"స్టాపిట్" పెద్దగా అరిచాడు గిరిధర్. అందరూ ఉలిక్కిపడి యిటు చూసారు. అప్పటికే గిరిధర్ పైకి లేచి కాటికాపరి చొక్కా పట్టుకున్నాడు.

"ఎంత ధైర్యంరా నీకు రాస్కెల్! నా భార్య మంగళసూత్రం ముట్టుకునేంత చొరవ ఎవడిచ్చాడ్రా నీకు!" అతను తెల్లబోయాడు. అయినా సర్దుకుని.

"యిది మాకే చెందుతుందండి! శ్మశానానికి తీసుకొచ్చిన వస్తువులేవీ వెనక్కి పట్టుకుపోరండి. మేమే తీసుకుపోవాలని చెప్తారండి పెద్దాళ్ళు" వినయంగా చేతులు కట్టుకుని శ్రీకాకుళం భాషలో చెప్పాడు కాటికాపరి సుబ్బయ్య.

"అయితే మాత్రం..." వెనకనుంచి భుజంమీద చెయ్యిపడడంతో వెనక్కి తిరిగాడు.

తండ్రి! ఓదార్పుగా చూస్తూ "తప్పు బాబూ! అతను చెప్పింది నిజం! పద! యిక్కడ కూర్చుంటే యిలాంటివి కన్పిస్తూ మనసును బాధపెడ్తుంటాయి. యింటికి వెళ్దాం! నడు" మారు మాట్లాడకుండా మూగపోయిన మనసుతో వెను తిరిగాడు గిరిధర్.

రోజులు గడుస్తున్నాయి నిస్సారంగా! తన డాక్టరు వృత్తి రోజంతా తనను బిజీగా వుంచడంలో నెమ్మదిగా భార్యను మర్చిపోగలుగుతున్నాడు. కానీ ప్రసవం కోసం వచ్చిన పేషెంట్లను చూసినప్పుడల్లా భార్య కళ్ళలో మెదిలేది! అలా మెదలగానే ఆమె చిరునవ్వు, చిలిపి అల్లరి, ఆమెతో ఆడిన సరసాలు అన్నీ మదిలో మెదిలి రంపపుకోతగా వుండేది. అందుకే డెలివరీలన్నీ తోటి డాక్టర్లకి అప్పచెప్పి తను మిగిలిన కేసులు టేకప్ చేసేవాడు.

"వివాహబంధం" ధర్మ, అర్థ, కామ మోక్షాలకు ప్రతినిధి. యివన్నీ తీరాలంటే కేవలం వివాహం మాత్రమే ప్రధానం. అలాంటి ఉన్నతమైన బంధాన్ని యింత త్వరలో తెంచేసుకున్న దురదృష్టవంతుడు తను.

ఆరోజు హాస్పిటల్ అంతా గోలగోలగా వుంది. గిరిధర్ స్కూటర్ పార్క్ చేసి అర్థం కానట్టుగా లోపలకు వచ్చాడు. రూంలోకి వచ్చి బ్రీఫ్‌కేసు పక్కన పెట్టి చైర్‌లో కూర్చున్నాడు విశ్రాంతిగా. యింతలో డాక్టర్ రఘు స్ప్రింగ్‌డోర్ తెరుచుకుని పరిగెత్తుకుంటూ ఒక్క ఉదుటన గిరిధర్ ముందు నిలబడ్డాడు.


''డాక్టర్! హెల్త్ మినిష్టర్‌గారి వైఫ్‌కి అబార్షన్ అయిందట. అర్జంటుగా బ్లడ్ ఎక్కించాలి. యిప్పటికే ఫైంట్ అయిపోయి వుంది. కానీ గ్రూప్ దొరకటం లేదు. రేర్ గ్రూప్! ఆవిడ చనిపోతే మన పని గోవిందా! ఎలాగైనా బ్లడ్ అరేంజ్ చేయాలి సర్'' ఆయాసంతో రొప్పుతూ అన్నాడు. గిరిధర్ ఆలోచనలో పడ్డాడు.

బ్లడ్ బ్యాంకుకు ఫోన్‌చేసి గ్రూప్ పేరు చెప్పాడు. ''చాలా కొద్దిగా ఉంది'' అని సమాధానం వచ్చింది.

అతనికి కంగారెక్కువైంది. లేచివెళ్ళి ఆవిడ వార్డుకు వెళ్ళాడు. గబగబ బి.పి. చూసాడు. చాలా తగ్గిపోయివుంది. యింకొంచెం తగ్గిందంటే ఈవిడ బ్రతకడం కష్టం. ఆ మెరుపులాంటి ఆలోచన వచ్చింది.

గబగబ వార్డులోని పేషంట్లందరి బ్లడ్ టెస్ట్ చేయమని ఆర్డరు వేసాడు. తను ఆమెనే కనిపెట్టుకుని కూర్చున్నాడు. పక్కన హెల్త్ మినిస్టర్ దీనంగా ''డాక్టరుగారు! మీరే కాపాడాలి. ఎంతైనా ఖర్చు భరిస్తాము నా భార్యను బ్రతికిస్తే మీ హాస్పిటల్‌కి మరో అంబులెన్స్ బహుమతిగా ఇస్తాను ప్లీజ్ వేడుకున్నాడు.''

''అంబులెన్స్'' ఆ మాట వినగానే గిరిధర్‌కు ఎక్కడలేని ఉత్సాహం వచ్చింది. అంబులెన్స్ కావాలంటే ఈ రోజుల్లో కనీసం రెండు లక్షలు పెట్టాలి. అలాంటిది ఫ్రీగా యిస్తానంటున్నాడు ఈ మినిష్టర్. ''ఒక్క పేషంట్. రెండు లక్షల బహుమతి' ' యిదే ఛాన్స్ యితన్ని వాడుకోవడానికి. యిదే మరో పేషంటైతే ఎప్పుడో వదిలేసే



వాడు. కానీ ఈ పేషంటును ఎలాగైనా బ్రతికించాలన్న పట్టుదల పెరిగిందిఅతన్నికి

"నర్స్! ఏమైంది బ్లడ్ సంగతి" అసహనంగా అరిచాడు.

"అదుగో వస్తున్నారు సర్ వాళ్ళు" సంతోషంగా అరిచింది నర్స్.

లాబ్ టెక్నిషియన్ వచ్చి చూపించాడు రిపోర్ట్స్. హాస్పిటల్ మొత్తానికి యిద్దరి దగ్గరే వుంది ఆ గ్రూపు. ఒక పేషంట్‌కి బ్లడ్‌కాన్సర్ వ్యాధి.

మరో పేషంట్‌ను యింకా టెస్ట్ కూడా చెయ్యలేదు. పాపం! యిప్పుడే కన్సల్టేషన్‌కు వచ్చివుంటాడు. యిట్స్ ఆల్ రైట్! ఏది ఏమైనా బ్లడ్ అవసరం! నర్స్‌ను పిలిచి గబగబ అతని రక్తం బాటిల్‌లోకి ఎక్కించమని ఆదేశించాడు. ఒకవేళ అతను యివ్వనంటే బలవంత పెట్టైనా ప్రాణాన్ని రక్షించమని బ్రతిమాలమన్నాడు. ఆమె సరేనని వెళ్ళిపోయింది. బ్యాంక్‌నుంచి తెచ్చిన కొద్ది రక్తం ఎక్కించడం ప్రారంభించాడు

గిరిధర్ అసహనంగా అటు యిటూ తిరుగుతున్నాడు. ఒక గంట తర్వాత నర్స్ బాటిల్ తీసుకుని వచ్చింది నిండా రక్తంతో. గిరిధర్ ముఖం వికసించింది. ఆనందంగా అందుకుని పేషంట్‌కి ఎక్కించడానికి ట్యూబ్ కనెక్ట్ చేశాడు.

"డాక్టర్! డాక్టర్" యిద్దరు నర్సులు, వారివెనుక ఓ నలభైయేళ్ళ యువతి యిటు పరుగెత్తుకుంటూ వస్తున్నారు. ఆమె పెద్దగా ఏడుస్తోంది. గిరిధర్‌కు చెమట పట్టడం ప్రారంభించింది ఏదో కీడు శంకిస్తోంది మనసు.

"డాక్టర్! యిందాక మనం రక్తం తీసిన వ్యక్తి కొలాప్స్ అయిపోయాడు" నర్స్ ఆయాసపడుతూ చెప్పింది.

"అదేలా?" విస్మయంగాను, భయంతో అడిగాడు గిరిధర్.

"యిందాక బి.పి చూడకుండా అర్జెంట్ అని బ్లడ్ తీసేసాం. అతనికి బి.పి చాలా తక్కువ అని మాకు తెలియదు. పైగా అతనికి రక్తక్షీణత కూడా వుందని అతని భార్య చెప్పింది" ఆందోళనగా చెప్పింది నర్సు.

"పేషంట్ బీదవాడా! లేక రిచ్ ఫెలోనా!" గుసగుస గా అడిగాడు.

"చూట్టానికి చాలా బీదవాడుగా వున్నాడు సర్."

"అమ్మయ్య! ఫరవాలేదు! ఈ కేసు యింతటితో ముగిసిపోతుంది. పోనీ ఒకసారి చూస్తే ఏం పోయింది? పాపం! మృత్యుదేవతను వెతుక్కుంటూ వచ్చినట్లున్నాడు" అనుకుంటూ రూం బయటకు నడిచాడు. ఎదురుగా స్ట్రెచర్‌మీద శవాన్ని వేసుకుని తీసుకువస్తున్నారు వార్డ్ బోయ్స్. దగ్గరకు వచ్చాక కప్పివ గుడ్డను ముఖంమీదనుంచి తొలగించి చూసాడు ఏ ఫీలింగ్ లేకుండా! కాటికాపరి సుబ్బయ్య!

అదిరిపడ్డాడు గిరిధర్. ఆరోజు ... చనిపోయిన తన భార్య తాళిబొట్టును ముట్టుకుంటే అతని చొక్కాపట్టుకున్నాడు. మరి ఈరోజు, ఈ మినిష్టర్ భార్యకోసం తన చేతుల్తో తనే సుబ్బయ్యను చంపి అతని భార్య తాళిబొట్టును శాశ్వతంగా దూరం చేశాడు. మరి తను... ఈ హాస్పిటల్‌కు కాటికాపరి కాదూ?

*